క్లుప్తంగా

వెండి కిరీటాల వితరణ



వెండి కిరీటంతో బయలుదేరుతున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని సంతమైదానం సమీపంలో వెలసిన కావమ్మ, మారయ్య స్వామివార్లకు పట్టణానికి చెందిన కాట్రపల్లి గోపి, రాజ్యలక్ష్మి దంపతులు ఆదివారం వెండి కిరీటాలను బహూకరించారు. వాటిని ఆలయ నిర్వాహకులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

విజేతగా మంగళం జట్టు



విజేత జట్టుకు జ్ఞాపికతో పాటు నగదును అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రంలో ఆదివారం మన్నసముద్రం యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళం జట్టు విజేతగా నిలిచింది. టోర్నమెంట్‌లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 30 జట్లు పాల్గొన్నాయి. మన్నసముద్రం, మంగళం జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. రెండు జట్లు తలపడగా మంగళం జట్టు విజేతగా నిలించింది. విజేత జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. మన్నసముద్రం జట్టుకు రూ.7 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో తాళ్లపాక సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి పూజలు



పుష్ప అలంకరణలో వారాహి అమ్మవారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో వారాహి అమ్మవారి ఆషాడ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కె.రామచంద్ర రెడ్డి పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కార్తికేశన్, సతీష్ శర్మ, గణేష్ శర్మ, ఆలయ సిబ్బంది శరవణ, పరంధామ రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మట్టికుప్ప

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డు తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎత్తయిన మట్టికుప్ప ప్రమాదకరంగా ఉంది. లారీల నుంచి వాహనాలు కిందికి దించడానికి ఆ మట్టికుప్పను ఏర్పాటు చేశారు. గత వారం రోజులుగా ఆ మట్టికుప్ప ప్రమాదకరంగా ఉంది. ఇలాంటి సమయంలో వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మట్టికుప్ప ఎవరు ఏర్పాటు చేశారో తెలుసుకుని ఆ మట్టికుప్పను తొలగించాల్సి ఉంది.



నష్టాల బాటలో వేరుశనగ రైతు



వేరుశనగ పంటను ఒబ్బిడి చేస్తున్న రైతులు



వేరుశనగ కాయలను ఆరబోస్తున్న రైతులు

- అందని గిట్టుబాటు ధర
- పెట్టుబడి కూడా రాని వైనం
- అప్పుల పాలవుతున్న అన్నదాత



వేరుశనగ పంట



వేరుశనగ పంట ఒబ్బిడిలో రైతు

బుచ్చినాయుడుకండ్రిగ: వేరుశనగ కాయలకు గిట్టుబాటు ధర అందకపోవడంతో మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో సుమారు 2 వేల ఎకరాల మెట్ట భూముల్లోని బోర్లు, బావుల వద్ద కే 6 రకం వేరుశనగ పంటను సాగు చేశారు. సరైన సమయంలో వర్షం కురవకపోవడంతో తగిన విధంగా కాయలు ఊరలేదు. దీనికితోడు తెగుళ్ల సోకడంతో పంట దెబ్బతింది. ఎకరాకు 50 బస్తాలు దిగుబడి రావలసి ఉండగా 15 నుంచి 20 బస్తాలు మాత్రమే వచ్చాయి. ఎక్కువగా తాలు కాయలు కాయడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. విత్తనంలో నూనె శాతం కూడా తక్కువగా ఉందని, అందుకే కొనుగోలు చేయడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 40 కేజీల వేరుశనగ కాయల బస్తా ధర రూ.2,100 పలుకుతోంది. గత రబీ సీజన్‌లో రూ.2,800 ధర పలికింది. ఎకరా వేరుశనగ పంటను సాగు చేయడానికి రూ.60 వేలు ఖర్చు అవుతుందని, ఇప్పుడు 20 బస్తాల దిగుబడి వచ్చిందని, వాటిని అమ్మితే రూ.22 వేలు వస్తుందని, రూ.38 వేలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర వచ్చినప్పుడు అమ్ముకుందామని అనుకున్నా కాయలను నిల్వ చేసుకోవడానికి గోడౌన్లు లేవని వాపోతున్నారు. అప్పులు చేసి పంటను పండిస్తే గిట్టుబాటు ధరలేకపోవడం దారుణమని రైతుల కంటతడి పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి, గిట్టుబాటు ధర చెల్లించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

వాతావరణంలో మార్పుతోనే దిగుబడి తగ్గింది

వాతావరణంలో మార్పుతోనే మండలంలో వేరుశనగ పంట దిగుబడి తగ్గింది. ఆరు నెలలుగా వర్షాలు కురవలేదు. ఎండ వేడిమిని తట్టుకోలేక పంట దెబ్బతినింది. రైతులు వస్తే మిల్లర్లతో మాట్లాడి గిట్టుబాటు ధరకు అమ్మిస్తాం. మార్కెట్ యార్డు అధికారులతో మాట్లాడి వేరుశనగ కాయలను నిల్వ చేయించేందుకు కృషి చేస్తాం.

– వ్యవసాయాధికారి భారతి

నేడు వైఎస్సార్ జయంతిని ఘనంగా జరుపుకుందాం

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడులో సోమవారం దివంగత నేత వైఎస్సార్ జయంతిని ఘనంగా జరుపుకుందామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. సత్యవేడు పట్టణంలోని నేతాజీ రోడ్డు మలుపు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

7 మండలాల్లో..



సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం విజయవంతం చేయాలని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని 7 మండలాల్లో పార్టీ కన్వీనర్లు, అనుబంధ విభాగాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తల సమన్వయంతో సేవా కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయాలని ఆయన కోరారు. బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, నాగలాపురం మండలాల్లో జరిగే వేడుకల్లో నూకతోటి రాజేష్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

న్యాయవిద్య నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ



ప్రారంభోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తులు

తిరుపతి లీగల్: న్యాయవిద్య నేర్చుకోవడం నిరంతర ప్రక్రియ అని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్ తెలిపారు. తిరుపతిలో ఆదివారం నూతనంగా ఎస్ఎల్ జ్యుడిషియల్ సర్వీసెస్ అకాడమీని న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో న్యాయమూర్తులకు వివిధ చట్టాలు, పరిపాలనపై అవగాహన కల్పించడానికి జ్యుడిషియల్ అకాడమీలు ఉన్నాయన్నారు. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ మాట్లాడుతూ రాయలసీమ, కోస్తా జిల్లాలకు చెందిన న్యాయవాదులు జడ్జి పోస్టులకు, ఇతర పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికి న్యాయవాదులు చాలా సొమ్ము చెల్లించాల్సి ఉందని, అలాగే సమయం కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తిరుపతిలో పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అకాడమీలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, జడ్జి పోస్టుల పోటీ పరీక్షలకు మంచి కోచింగ్ ఇవ్వనున్నట్టు ఎస్ఎల్ జ్యుడిషియల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్లు యండమూరి నాగేంద్ర బాబు, ఆయన తనయుడు హైకోర్టు న్యాయవాది శరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రొఫెసర్ కృష్ణయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

వరదయ్యపాళెం: మండలంలోని వెంకటేశ్వర గిరిజ న కాలనీ, ఇందిరానగర్ గ్రామాల్లో ఇళ్లు కాలిపోయి నష్టపోయిన బాధితులకు ఆదివారం ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. వెంకటేశ్వర కాలనీకి చెందిన బుజ్జమ్మకు రూ.10 వేలు, ఇందిరా నగర్‌లో వెంకటేష్ కుటుంబానికి రూ.5 వేలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వర గిరిజన కాల నీలో కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు, పాఠశాల, శ్మశానానికి స్థలం మంజూరు చేయించాలని స్థానికులు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ భారతి, పార్టీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు. బుజ్జమ్మకు జనసేన నాయకులు చిరంజీవి యాదవ్, తులసి కలిసి రూ.5,500 అందజేశారు.

సాయినగర్‌లో తాగునీటి బోరు ఏర్పాటు



సాయినగర్‌లో బోరు వేస్తున్న సిబ్బంది

నాగలాపురం: పట్టణంలోని సాయి నగర్‌లో ఆదివారం బోరు తవ్వకం పనులను సర్పంచ్ చిన్నదొరై సుధ ప్రారంభించారు. సాయినగర్‌లో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వార్డు మెంబరు సునీల్‌కుమార్ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బోరు వేయడానికి అంగీకరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబు, ధనరాజ్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చిన్న పాండూరు పీహెచ్‌సీ సిబ్బందిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: పేద ప్రజలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హెచ్చరించారు. ఆయన ఆదివారం పాండూరు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎఫ్ఎన్ఓ తప్ప వైద్యాధికారులు, స్టాఫ్ నర్సు, ఇతర సిబ్బంది ఎవరూ హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. 24 గంటలు స్థాయి కలిగిన ఆరోగ్య కేంద్రంలో రాత్రి, పగలు తేడా లేకుండా వైద్యం చేయాల్సి ఉండగా నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, డీఎం అండ్ హెచ్‌వోకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు వైద్యులున్న ఈ ఆస్పత్రిలో ఒక్కరు కూడా విధులకు హాజరుకాకుండా డుమ్మా కొట్టడమేమిటని ప్రశ్నించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకపై తాను పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, హాస్టళ్లను తరచూ తనిఖీ చేస్తానని వెల్లడించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షులు యుగంధర్ రెడ్డి, నాయకులు బాలరాజు, రోశయ్య, దశరథయ్య ఉన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



భరత నాట్య ప్రదర్శనలో కళాకారులు,



భరత నాట్యం చేస్తున్న చిన్నారులు

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన రిషాన్వీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో భాగంగా మూషిక వాహన, అదివో అల్లదివో, పుష్పాంజలి, వెంకటాచల నిలయం, నటేష కౌత్యం, వెయ్యి నామాల వాడ, బ్రహ్మమొక్కటే, కొమ్మలాల, ఒకపరి ఒకపరి, ఏకదంతాయ, శివ శివ శంకర, చూడచక్కని తల్లి, ముద్దుగారే యశోద, వచ్చెను అలమేలు మంగ తదితర పాటలకు కళాకారులు రిషిశ్రీ, అవని, వినుక్షన, సాయి, అక్షర, నందన, ఆగ్నిక, వేద, జ్ఞానరుతిక, హిందు, కుషి, లీలా, మోక్షిత, చతురికల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులు తమ అభినయం, నాట్యంతో ప్రేక్షకులను మైమరపింపచేశారు. ఈ సందర్భంగా కళాకారులను ఏఈఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో యూపీ మంత్రులు





అమ్మవారిని దర్శించుకున్న యూపీ మంత్రులు ధర్మవీర్ ప్రజాపతి, పండిట్ శ్రీసునీల్ భరాల

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ధర్మవీర్ ప్రజాపతి, పండిట్ శ్రీసునీల్ భరాల వేర్వేరుగా వారి కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి ఆలయ ఏఈఓ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి బ్రహ్మానందరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో చీడపీడలు దూరం



పాలసముద్రం: పంటల మార్పిడి చేస్తే తెగుళ్లను, చీడపీడలను నివారించవచ్చని పాలసముద్రం వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ పేర్కొన్నారు. తర్వాత ఎరువులు, పురుగుమందుల ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. ప్రస్తుత పంటల స్థానంలో ఏయే పంటల సాగుతో లాభాలేమిటో ఆయన వివరించారు. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేయడం మంచిదికాదు. దీని వల్ల చీడపీడలు వృద్ధి చెందుతాయి. ఒక పంట వేసిన తరువాత వేరే పంటను సాగు చేయడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. కొన్ని పంటలకు తెగుళ్లు, పురుగులు ఎక్కువగా ఆశిస్తుంటాయి. చీడపీడలు ఆశించిన పంటను ఎంచుకుని సాగు చేసుకుంటే అధిక లాభం సాదించవచ్చు.

పంట మార్పిడి విధానం

- ప్రస్తుతం మెట్టలో వరికోతలు ప్రారంభమయ్యాయి. రానున్న రబీ సీజన్‌లో నీటి తడులతో ఇబ్బంది కలిగే అవకాశముంది. అందువల్ల వరికి ప్రత్యామ్నాయంగా పెసులు, వేరుశనగ వంటి నూనె గింజలు వేసుకోవడం మంచిది.
- అరటిలో ఎక్కువగా బ్యాక్టీరియా, దుంపకుళ్లు తెగుళ్లు ఆశిస్తున్న పొలాల్లో వరి, చెరకు వంటి పంటలను సాగు చేసి పంట మార్పులు చేసుకోవాలి.
- తమలపాకు తోటల్లో ఎండు తెగుళ్లు, మొదలు కుళ్లు తెగులు వ్యాపించినప్పుడు కనీసం మూడేళ్లకు ఒకసారి మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవచ్చు.
- వంగ పంటలో ఆశించే ఎండు తెగులుకు నివారణ కష్టం. దీంతో ఈ తెగులు సోకిన నేలలో కాలీఫ్లవర్ వేసుకుంటే మంచిది. వంగలో నులి పురుగులు ఎక్కువగా ఉంటే తరువాత బంతి పూలు వేసుకోవాలి.
- టమాటాలో ఎండు తెగులు ఆశిస్తే ఫ్రెంచ్ చిక్కుడు సాగు చేస్తే ఆ తెగుళ్ల తగ్గుతాయి.
- కూరగాయలు, తీగజాతి కూరల తెగుళ్ల నివారణకు వరి పంట సాగుతో పంట మార్పిడి చేసుకోవాలి.
- మిరప, టమాట, వేరుశనగ, కాలీఫ్లవర్ వంటి పంటలకు ఆశించే లద్దె పురుగు నివారణకు ఆ పంట పూర్తయ్యాక, సజ్జ, జొన్న, వరి, పొద్దుతిరుగుడు తదితర ఆరుతడి పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. అలాగే బంతిపూలు, ఆవాలు వంటి పైర్లను సాగు చేస్తే ఆకు ముడత తెగులును పారదోలవచ్చు.
- పసుపు పండించిన తరువాత వరి, జొన్న సాగు చేస్తే నులిపురుగులను నివారించవచ్చు.

ఒకే కుటుంబ పంటలు వద్దు



పంటల సాగు తరచూ మారుస్తుండాలి. ఒకే కుటుంబానికి చెందిన పంటలను వేయడంతో వాటికి సోకిన తెగుళ్లు, చీడపీడలు భూమిలో అలాగే ఉండిపోతాయి. తిరిగి పంట సాగు చేసిన సమయంలో ఆ పంటకు తప్పకుండా తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తాయి. ఉదాహరణకు టమాట, వంగ, మిరప, బెండ పంటలు ఒకే కుటుంబానికి చెందినవి. ఇవి ఒక దాని తరువాత ఒకటి వేయడంతో గత పంటకు ఉన్న తెగుళ్లు మరొక పంటకు సోకుతాయి. కావున తరచూ పంటల మార్పిడి తప్పనిసరిగా చేయాలి. లేకుంటే పలు సమస్యలు తలెత్తుతాయి. పంటల మార్పిడి చేసుకుంటూ ఉంటే రైతులకు ఖర్చులు కూడా తగ్గుతాయి. అలాగే ఆదాయం పెరుగుతుంది.

– ఢిల్లీప్రసాద్, వ్యవసాయాధికారి

తిరువీధులు జలమయం



తిరుపతి నగరంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వీధులంతా జలమయమయ్యాయి. వర్షపునీరు మోకాటి లోతు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. తీర్థకట్టవీధి, గాంధీరోడ్డు, శ్రీదేవి కాంప్లెక్స్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, కరకంబాడి రోడ్డు, చేపల మార్కెట్ రోడ్డు తదితర రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి







